సాక్షి
నారాయణపేట

ఆదివారం । 9 । జూలై । 2023



నకిలీల హవా

అలంపూర్ ఆలయాల్లో అసలు ఉద్యోగుల కంటే నకిలీలదే హవా కొనసాగుతోంది.

వివరాలు 8లో ►



ఓబీసీలకు చేసిందేమిలేదు

దేశంలోని ఓబీసీలకు ప్రధాని నరేంద్రమోదీ చేసిందేమి లేదని వి.హన్మంతరావు అన్నారు.

వివరాలు 8లో ►

గరిష్టం/కనిష్టం

31.4 /23.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇద్దరు నర్సుల సస్పెన్షన్

మద్దూరు: మద్దూరు ప్రాథమిక **ఆరోగ్య కేంద్రం**లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు **స్టాఫ్ నర్సు**లను సస్పెండ్ చేసినట్లు **ఆరోగ్య కేంద్ర** సూపరింటెండెంట్ రంజిత్‌కు**మార్ శనివారం** తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో స్టాఫ్ నర్సులు విక్టోరియా, మణెమ్మను నెలపాటు కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో తొలి ఆపరేషన్ విజయవంతం



నారాయణపేట రూరల్: జిల్లా ఆస్పత్రిలో మొదటిసారి థైరాయిడ్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన కతలమ్మ(18) కొద్ది రోజులుగా థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలకు వచ్చిన ఆమెకు, స్థానికంగా ఆపరేషన్ చేయాలని వైద్య బృందం నిర్ణయించుకున్నారు. ఈ మేరకు శనివారం తెల్లవారుజామున ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. అనస్తీషియా దీపిక, పీజీ డాక్టర్లు రంజిత్, శశాంక్, స్టాఫ్‌నర్స్ విక్టోరియా, విజయలక్ష్మి, దశరథ్ ఉన్నారు.

రాష్ట్రంలో అసమర్థ ప్రభుత్వం : కాంగ్రెస్

మక్తల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అసమర్థ ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి విమర్శించారు. శనివారం మక్తల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి తమ మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కారంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కార్మికులు ఆకస్మాత్తుగా మృతి చెందితే ప్రభుత్వం కుటుంబాలకు ఏమాత్రం నష్ట పరిహారం చెల్లించడంలేదని అన్నారు. శ్రమకు తగిన ఫలితం లేకుండాపోయిందని, వారిని ఎవరూ గుర్తించడంలేదని అన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. జిల్లా ఇష్యూ అధ్యక్షుడు కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, ఈశ్వరయ్య, వెంకటేష్, రాంచంద్రి, నర్సింహ, నారాయణ, కార్మికులు శ్రీనివాసులు, నర్సింహ, కిష్టప్ప, రాజు, అంజనేయులు, రాములు, బాల్‌రాజు, చంద్రయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



కృష్ణా: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మురహర్‌దొడ్డిలో శనివారం గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేంద్రప్ప, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, రవి, ముడుమాల్ వెంకటప్ప, అశోక్‌గౌడ్, చెన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

కోస్గి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా శనివారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వాలని కోరారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, భానునాయక్, ఇద్రీస్, నాయకులు నాగులపల్లి శ్రీనివాస్, నరేందర్, దేవేందర్, సురేష్, వెంకట్రాములు, ఆనంద్, సలీం, ఆసీఫ్, ఫెరోజ్, ఇజాజ్, వెంకట్, గిరిప్రసాద్‌రెడ్డి, నర్సింహ, వెంకటయ్య, హరీశ్, విద్యాసాగర్, ప్రతాప్, ప్రభోత్తం పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం..

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అవకతవకలు



విద్యుత్ సబ్ స్టేషన్


- అధికారుల అండతో కాంట్రాక్టర్ల అక్రమాలు
- ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకుండానే మొత్తం పనులు పూర్తి చేసినట్లు నమోదు
- అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలంటున్న రైతులు



ఫొటోలో ఉన్న మహిళా రైతు పేరు కళావతి. మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన ఈమె తన వ్యవసాయ పొలంలో సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకునేందుకు ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించింది. సంబంధిత లైన్‌మెన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి కావాల్సిన విద్యుత్ స్తంభాలు, ఇతర పూర్తి వివరాలతో ఎస్టిమేషన్ రిపోర్ట్ ఇవ్వడంతో అధికారుల సూచన మేరకు డీడీలు కట్టి స్థానిక విద్యుత్ కార్యాలయంలో అందజేసింది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైనట్లు రైతుఫోన్‌కు సమాచారం వచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్ రావడం ఆలస్యం కావడంతో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సదరు మహిళా రైతు పొలంలో ఎలాంటి పనులు చేయకపోయినప్పటికీ ఆన్‌లైన్‌లో మాత్రం గతనెల 9న పనులు పూర్తి చేసినట్లు నమోదైంది. ఈ విషయమై ఏఈని అడుగగా కాంట్రాక్టర్‌ను అడగాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ ఫోన్ పెట్టేశాడు. వాస్తవానికి అక్కడ పనులు మాత్రం పూర్తికాలేదు. జిల్లాలో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని, ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించడాన్ని దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

డీడీలు చెల్లించి ఏడాది...

మీర్జాపూర్ గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం మూడు డీడీలు చెల్లించాలని విద్యుత్ అధికారులు సూచించడంతో బాధిత రైతు ఒక్కో డీడీ రూ.5800 చొప్పున 2022 సంవత్సరం జులై 5న మూడు డీడీలకు రూ.17400 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా అధికారులు రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. సంవత్సరమైనా ట్రాన్స్‌ఫార్మర్ రాకపోవడంతో నేరుగా అధికారులను సంప్రదించగా మరో డీడీ చెల్లించాలని ఏఈ పర్వతాలు సూచించాడు. దీంతో ఈ ఏడాది మే నెలలో 9వ తేదీన రూ.5800లతో మరో డీడీ చెల్లించి కార్యాలయంలో అందజేశారు. ట్రాన్స్‌కో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కావాల్సిన సామగ్రి మేరకు అంచనా నివేదిక (ఇస్టిమేషన్) వేసి బాధిత రైతులకు సూచించడంతోనే మూడు డీడీలు చెల్లించారు. అధికారులు మాత్రం సంవత్సర కాలంపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ధరలు పెరిగాయని, పెరిగిన అంచనా వ్యయం మేరకు మరో డీడీ చెల్లించాలని సూచించడంతో అధికారులు చేసిన తప్పిదానికి రైతు అదనంగా మరో డీడీ చెల్లించాల్సి వచ్చింది. డీడీలు చెల్లించినప్పటికీ కార్యాలయం చుట్టూ తిరగడం తప్పలేదు. ఇదే క్రమంలో హన్మాన్‌పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ రెడ్డి అనే రైతు, ఆన్‌లైన్‌లో పనులు పూర్తి చేసినట్లు నమోదు చేశారు.



గతేడాది చెల్లించిన డీడీ వివరాలు

కోస్గి: ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్ ఇస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని ఆదేశాలివ్వడంతో కాంట్రాక్టర్లకు పెట్టుబడి లేని ఆదాయ వనరుగా మారింది. అధికారులతో కుమ్మక్కై రైతుల పేర ఇష్టారీతిన దోచుకుంటున్నారు. ఎవరైన రైతులు ట్రాన్స్‌ఫార్మన్ కావాలంటే లైన్‌మెన్ అంచనా నివేదిక ఆధారంగా కావాల్సిన డీడీలు చెల్లించగానే రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతులు చెల్లించిన డీడీల ఆధారంగా ముందుగా చెల్లించిన వారికి ముందుగా అనే ప్రాతిపదికన సీనియారిటీ జాబితా ఆన్‌లైన్‌లోనే అప్‌డేట్ అవుతుంది. ఈ విషయంలో రైతులకు అవగాహన లేకపోవడంతో అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. రైతులకు ఎలాంటి సమాచారం లేకుండానే పనులు పూర్తి చేసినట్లు నమోదు చేసి వారి పేర మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి పలుకుబడి కలిగిన వారికి, ప్రజాప్రతినిధుల బంధువులకు అందజేస్తుంటారు. బాధిత రైతులు మాత్రం నెలల తరబడి విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతుంటారు. ఉన్నత అధికారులకు మాత్రం ఆన్‌లైన్ రిపోర్టులు చూయించి అంతా సవ్యంగానే ఉందంటూ నివేదికలు రూపొందించి తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే బయటపడ్డ బాగోతం..

కార్యాలయం చుట్టు తిరిగిన బాధిత రైతులు ఈ ఏడాది జూన్ నెలలో ఆన్‌లైన్‌లో తమ డీడీల ఆధారంగా వివరాలు తనిఖీ చేశారు. పని మొత్తం పూర్తయినట్లు నమోదు చేశారు. దీంతో ఆన్‌లైన్ వివరాలతో అధికారులను సంప్రదిస్తే అసలు బాగోతం బయటపడింది. కాంట్రాక్టర్‌కు సంబంధం అంటూ అధికారులు, అధికారులదే బాధ్యత అంటూ కాంట్రాక్టర్ పొంతనలేని సమాధానాలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు ఆన్‌లైన్‌లో వివరాలు తప్పుగా ఉంటాయని ఏకంగా విద్యుత్ శాఖ ఏడీ అంటూ బుకాయించడం, సంబంధిత విద్యుత్ కాంట్రాక్టర్ మాత్రం విద్యుత్ స్తంభాలు, సామగ్రి వచ్చాయని పని చేస్తాము వ్యవసాయ పొలం దగ్గరకు రావాలని బాధిత రైతులకు ఫోన్ చేస్తుండటం కొసమెరుపు. కాగా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల దిమ్మె నిర్మాణాలు, ఏబీ స్విచ్‌ల ఏర్పాటు, విద్యుత్ కంచె ఏర్పాటు, ఎర్తింగ్ నిర్మాణం వంటి పనుల్లో చేయని పనులకు బిల్లులు చేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని క్షేత్రస్థాయిలో పని చేస్తున్న కొందరు విద్యుత్ సిబ్బంది బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో సమగ్ర విచారణ జరిపితే పెద్దఎత్తున అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

కాంట్రాక్టర్‌తో మాట్లాడుతా..

ఇదే విషయమై ఏడీ సంధ్యారాణిని వివరణ **కోరగా అప్పటి**కప్పుడు వివరాలు తెలుసుకొని **మా దగ్గర ఆన్‌లైన్**లో బాధిత రైతు వివరాలు **పరిశీలిస్తే ఇంకా** అగ్రిమెంట్ స్టేజీలోనే చూపి**స్తుంది. ఆన్‌లైన్**లో పనులు పూర్తి చేసినట్లు **వచ్చిందంటే** ఏదైనా సమస్య ఉందేమో కాంట్రాక్టర్‌తో మాట్లాడుతాను. పూర్తి వివరాలు తెలుసుకుంటానన్నారు.

– సంధ్యా రాణి, ఏడీ

ఆన్‌లైన్‌లో తప్పుగా ఉంటుందన్నారు

ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తామంటే సొంత ఖర్చులతో దిమ్మె కట్టించాను. వెంట బడితే విద్యుత్ స్తంభాలు మాత్రమే వేశారు. ట్రాన్స్‌ఫార్మర్ అడిగితే ఈ రోజు, రేపు అంటున్నారు. డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్న పనులు మాత్రం పూర్తి చేయడంలేదు. ఎమ్మెల్యే లెటర్ కావాలంటే తీసుకొచ్చి ఇచ్చాను. ఆన్‌లైన్‌లో నా పేరుతో వివరాలు పరిశీలిస్తే పనులు పూర్తి చేసినట్లు వస్తుంది. ఈ విషయం ఏడీని అడిగితే ఆన్‌లైన్‌లో తప్పుగా ఉంటుందంటున్నారు. ఏడీ కార్యాలయంలో పూర్తి వివరాలు అడిగితే మా దగ్గర లేవని, జిల్లా అధికారుల దగ్గర ఉంటాయని తప్పించుకుంటున్నారు.

– ప్రవీణ్ రెడ్డి, బాధిత రైతు, హన్మాన్‌పల్లి

పనులు చేస్తామని ఫోన్ చేస్తున్నారు

డీడీలు చెల్లించి సంవత్సరం దాటిన ఇంతకాలం పట్టించుకోలేదు. గట్టిగా అడిగితే మరో డీడీ కట్టాలంటే డీడీ కట్టినప్పటికీ అదే కాలయాపన. ఆన్‌లైన్‌లో వివరాలు తీసుకొని వెళితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఇప్పుడేమో పనులు చేస్తామంటూ అధికారులు, కాంట్రాక్టర్ ఫోన్‌లు చేస్తున్నారు.

– పవన్ కుమార్, బాధిత రైతు, మీర్జాపూర్

కాంట్రాక్టర్‌తోనే మాట్లాడండి

బాధిత రైతులు అందించిన వివరాల ఆధారంగా విద్యుత్ శాఖ ఏఈ పర్వతాలును ఫోన్‌లో వివరణ కోరగా మొదట ఆన్‌లైన్‌లో అలా వచ్చిందంటే రైతు పొలంలో పని చేసి ఉంటారంటూనే పూర్తి సమాచారం కాంట్రాక్టర్ దగ్గర ఉంటుందని అన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.



పని పూర్తయినట్లు చూపుతున్న ఆన్‌లైన్ వివరాలు

కోర్టు విధులు కీలకమైనవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: నేరస్తులకు తగిన శిక్ష పడే విధంగా చూసే బాధ్యత కోర్టు డ్యూటీ అధికారులదేనని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాలోని అన్ని పీఎస్‌లలో కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసు ఆఫీసర్లకు ఎస్పీ శనివారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్యాప్తు, ప్రాసిక్యూషన్, ఇన్వెస్టిగేషన్ చేయాల్సిన పద్ధతిని వివరించారు. సాక్షులు, నిందితులను కోర్టుకు హాజరుపరిచే విధానం, సకాలంలో కేసులు పూర్తయ్యేలా తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. పోలీసు వ్యవస్థపై నమ్మకం కల్పించాలని, కోర్టు ఆదేశాలను తూ.చా తప్పకుండా పాటించాలని తెలిపారు. కోర్టు సిబ్బందితో సమన్వయంతో ముందుకుపోవాలన్నారు. నేరస్తులకు శిక్ష పడేలా కోర్టులో ఆధారాలు అందించడంలో డ్యూటీ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, డీసీఆర్‌బీ ఎస్‌ఐ సునీత, పీసీలు పాల్గొన్నారు.



హాజరైన కోర్టు డ్యూటీ అధికారులు

జాగిలాల గది నిర్మాణం పరిశీలన

నారాయణపేట రూరల్: జిల్లా ఏర్పాటు తర్వాత ఒక్కొక్కటిగా సౌకర్యాలు సమకూర్చుతున్న హోం శాఖ, తాజాగా జాగిలాలకు అవసరమైన గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సుభాస్‌రోడ్డు ఏరియాలో గల పాత పోలీస్ క్వార్టర్స్ ఖాళీ స్థలంలో జాగిలాలకు గదులను నిర్మిస్తున్నారు. శనివారం వాటిని ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు పరిశీలించి సూచనలు చేశారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, ఆలస్యం కాకుండా సమయానికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో దొంగతనాలు, హత్యలు, మాదకద్రవ్యాల తరలింపుపై నిఘా ఉంటుందని, అవసరానికి తగ్గట్టు జాగిలాల సహాయం తీసుకుంటారని, అందుకు స్థానికంగా జాగిలాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఆర్‌ఐ కృష్ణయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

- అడిషనల్ కమిషనర్ అజయ్‌రావ్

కృష్ణా: కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ అజయ్‌రావ్ ఆదేశించారు. శనివారం మండల సరిహద్దులోని ఎక్సైజ్ చెక్‌పోస్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే మద్యాన్ని నియంత్రించాలని, అందుకు ఎక్సైజ్ పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా కొన్ని వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ దత్తరాజ్‌గౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా అధికారి సైదులు, ఏపీ ఈఎస్ నర్సింహారెడ్డి, ఏపీఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌రావ్, అలాగే ఎస్‌టీఎఫ్ హైదరాబాద్ సిబ్బంది, డీటీఎఫ్ మహబూబ్‌నగర్ సిబ్బంది ఉన్నారు.



సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న అడిషనల్ కమిషనర్ అజయ్‌రావ్

'విజయవర్ధిని'కి పునరుజ్జీవం



బీచుపల్లి సమీపంలోని తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన విజయవర్ధిని ఆయిల్ మిల్లు

స్థానిక రైతాంగానికి ఆర్థిక తోడ్పాటునందించి.. రెండు దశాబ్దాల పాటు వేలాది మందికి ఉపాధి కల్పించింది.. ఈ క్రమంలో కొందరు అధికారుల చేతివాటంతో అప్పుల ఊబిలోకి వెళ్లిపోయి మూతబడిన విజయవర్ధిని ఆయిల్ మిల్లు పునఃప్రారంభానికి అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ, ఆయిల్‌ఫెడ్ సంస్థ చొరవతో ఈ నెలలోనే మిషనరీ ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వేగంగా చర్యలు చేపట్టారు.

– మహబూబ్‌నగర్ డెస్క్

బీచుపల్లి ఆయిల్‌మిల్లు పునఃప్రారంభానికి చర్యలు

- దశల వారీగా పరిశ్రమను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి
- ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పాం సాగుపై రైతులకు ప్రోత్సాహం
- ఈనెల నుంచే మిషనరీ ఏర్పాటు చేసేందుకు అధికారుల సన్నాహాలు
- ఏడాదిన్నరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం

బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్ 1990లో ప్రారంభించారు. ఇటిక్యాల మండలం తిమ్మాపూర్ శివారులో దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో.. దాదాపు రూ.18 కోట్ల వ్యయంతో ఆయిల్ మిల్లును ఏర్పాటు చేశారు. నూనెగింజల సాగులో రైతులను మరింత ప్రోత్సహించడానికి, తక్కువ ధరకే ప్రజలకు నూనె అందించడానికి 1983లోనే ఈ పరిశ్రమ నిర్మాణానికి బీజాలు పడ్డాయి. చివరికి ఏడేళ్ల నిరీక్షణ తర్వాత ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభించారు. జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ సహకారంతో 200 టన్నుల సామర్థ్యం గల నూనెమిల్లు, 100 టన్నుల సామర్థ్యం గల సాల్వెంట్ ఆయిల్, 100 టన్నుల సామర్థ్యం గల రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విజయ బ్రాండ్ నూనెలను ఉత్పత్తి చేసి వచ్చే ఆదాయంలో రైతులకు వాటా ఇచ్చే ఉద్దేశంతోపాటు వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడం కోసం దీన్ని ప్రారంభించింది. ఈ మిల్లు పరిధిలో గద్వాల, వనపర్తి, అలంపూర్, ఆత్మకూరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌తోపాటు నల్లగొండ, కర్నూలు జిల్లాల్లో నూనె గింజలను సేకరించి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు నిర్ణయించారు. అప్పట్లోనే ఈ మిల్లులో ప్రత్యక్షంగా 1,400 మంది పనిచేయగా.. పరోక్షంగా మరో 2వేల మంది ఉపాధి పొందారు.

మిషనరీ ఏర్పాటుకు చర్యలు

తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో బీచుపల్లి ఆయిల్ మిల్లును 2019 నవంబర్‌లో పునఃప్రారంభించి, పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆయిల్ మిల్లులో నాలుగు ఎకరాలలో 228 ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి 42 వారాల స్టేజీలో ఉన్నాయి. సాధారణంగా ఆయిల్‌పాం మొక్కలు 36 నెలలకు రాగానే పక్వానికి వచ్చిన ఆయిల్ గెలల కోత ప్రారంభిస్తారు. ఒక ఎకరాలో 10 నుంచి 12 టన్నులు దిగుబడి వస్తుంది. టన్ను ధర ప్రస్తుతం రూ.13,500గా ఉంది. మిల్లులో యంత్రాలు ప్రారంభమైతే ఒక గంటకు 30 టన్నుల ఆయిల్ గెలలు అవసరం. ఒకరోజుకు దాదాపు 720 టన్నుల ఆయిల్‌పాం గెలలు మిల్లుకు అందుబాటులో ఉండాలి. కాగా.. మిల్లులో మిషనరీ ఏర్పాటు కోసం ఈ నెలలోనే భూమిపూజ చేయనున్నట్లు సమాచారం. అయితే పూర్తిస్థాయిలో మిషనరీ ఏర్పాటు చేసేందుకు దాదాపు ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం కోతకు వచ్చిన ఆయిల్ గెలలను ఎవరైనా రైతులు మిల్లుకు తీసుకువస్తే అధికారులు ఇక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో అశ్వారావుపేటకు తరలిస్తున్నారు.



ఆయిల్ పాం గెలలు

20 ఏళ్లకే మూత..


రెండు దశాబ్దాలపాటు విజయవంతంగా కొనసాగిన బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్ మిల్లు 2003వ సంవత్సరంలో మూతబడింది. మిల్లులో ఉత్పత్తి చేసిన నూనె, ఇతర పదార్థాల అమ్మకాల్లో అధికారుల చేతివాటం, అక్రమాలు తోడై అప్పుల ఊబిలోకి వెళ్లింది. అప్పులను తీర్చి మళ్లీ ప్రారంభించేందుకు ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) ఆర్థిక సహకారం అందించిప్పటికీ అక్రమాలు కొనసాగాయి. ఫలితంగా ఎన్‌డీడీబీ ఇచ్చిన ఆర్థిక సహాయం కూడా వృథా కావడంతో పరిశ్రమ నష్టాల్లోకి వెళ్లి 2003లో పూర్తిస్థాయిలో మూతబడింది.

దశల వారీగా అభివృద్ధి..

విజయవర్ధిని ఆయిల్ మిల్లును పునరుద్ధరించి.. దశల వారీగా అభివృద్ధి చేసేందుకు నాలుగేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా ఆయిల్ మిల్లుకు సంబంధించి అప్పు రూ.26.03 కోట్లు ఉండగా.. ఆయిల్‌ఫెడ్ సంస్థ జాతీయ పాడి అభివృద్ధి సంస్థతో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.8.44 కోట్లు చెల్లించి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 2019లో మిల్లులో పామాయిల్ మొక్కల ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. భవిష్యత్‌లో ఆయిల్‌పాం క్రాషింగ్ యూనిట్ ఏర్పాట్లుకు చర్యలు చేపట్టారు. ఆయిల్‌పాం సాగులో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట, అప్పారావుపేట, పశ్చిమ గోదావరి జిల్లా పేదవేగి ప్రాంతానికి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి స్థానిక రైతులను తీసుకెళ్లి.. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగును ప్రారంభించేలా అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని 206 మండలాలు ఆయిల్‌పాం సాగుకు అనుకూలమని కేంద్ర ఆయిల్‌పాం పరిశోధన సంస్థ, రాష్ట్ర ఉద్యానవన సంస్థలు ప్రకటించాయి. దీంతో రైతులను ఆయిల్‌పాం సాగులో ప్రోత్సహించి.. వారికి అందుబాటులో ఉండేలా బీచుపల్లి ఆయిల్‌మిల్లు పునరుద్ధరణ చేపట్టారు.




తక్కువ పెట్టుబడితో..



ఆయిల్‌పాం తోటలు ఈదురు గాలులు, భారీ వర్షాలను తట్టుకొని నిలబడ్డాయి. పంటకు కూడా ఎలాంటి హాని జరగలేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదు. దీనిని సాగు చేయడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. సాధారణ వ్యవసాయంలో చీడపీడల బాధ అధికంగా ఉండేది. కానీ, ఆయిల్‌పాం తోట సాగుతో చీడపీడల బెడద కూడా తగ్గింది.

– చిన్నారెడ్డి, రైతు, మునుగాల, ఇటిక్యాల మండలం

త్వరలోనే మిల్లు పునరుద్ధరణ..



జిల్లాలో 2019 నుంచి రైతులు ఆయిల్‌పాం తోటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 4,700 ఎకరాల్లో సాగవుతుంది. అక్కడక్కడ గెలలు కోతకు వస్తున్నాయి. త్వరలోనే వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిచే ఆయిల్ మిల్లును పునరుద్ధరించనున్నాం. పనులు ప్రారంభమైతే ఏడాదిలోగా పూర్తిస్థాయిలో మిషనరీ ఏర్పాటు చేసి రైతులకు మిల్లును అందుబాటులోకి తీసుకువస్తాం.

– వెంకటేష్, అయిల్ మిల్లు డిప్యూటీ మేనేజర్

క్లుప్తంగా

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


జలంధర్ (ఫైల్)

ఆత్మకూర్: తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన తూంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని తూంపల్లి గ్రామానికి చెందిన చాకలి రాములుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. రెండో కుమారుడు జలంధర్(26) ఏ పని చేయకుండా తిరుగుతుండేవాడు. మద్యానికి అలవాటుపడ్డాడు. ఈనేపథ్యంలో కుమారుడికి సంబంధాలు రావడంలేదని, ఏదైనా పని చేసుకోవాలని తండ్రి కుమారుడిని మందలించాడు. దీంతో జలంధర్ గురువారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో వెతికారు. ఎంతకూ ఆచూకీ లభించలేదు. శుక్రవారం మధ్యాహ్నం గొర్రెల కాపరులు గ్రామశివారులో ఓ చెట్టుకు ఉరేసుకున్న విషయం గమనించి సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడింది జలంధర్‌గా గుర్తించారు. పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

బాలానగర్: ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం... బాలానగర్ మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన అమృత (55) శుక్రవారం కట్టెలు(వంట చెరుకు) తీసుకురావడానికి సమీప పొలాలకు, గైరాన్ భూమిలోకి వెళ్లింది. కట్టెలు తెచ్చి రాత్రికి భోజనం చేసి పడుకుంది. అర్ధరాత్రి ఆమె నోటి నుంచి నురుగ రావడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనపై ఆమె కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆస్పత్రి ఖర్చులు భరించలేక ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: అనారోగ్య సమస్యల కారణంగా ఆస్పత్రి అయ్యే ఖర్చులకు ఇబ్బందులు ఏర్పడడంతో భార్యభర్తలు గొడవపడి భార్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మర్లుకు చెందిన తీగల కళమ్మ(45) పట్టణంలోని ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాల వెనుక భాగంలో శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు కొన్ని రోజుల నుంచి ఫిడ్స్‌తో పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంది. ఈ క్రమంలో ఆస్పత్రికి వెళ్లడానికి అయ్యే ఖర్చు విషయంలో దంపతులు గొడవపడటంతో ఆమె మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు.

పెళ్లి కావడం లేదని.. యువకుడి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: పెళ్లి కావడం లేదని.. మద్యానికి బానిసైన ఓ యువకుడు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ టి.కృష్ణ కథనం ప్రకారం.. మహమ్మదాబాద్‌కు చెందిన బండి గణేష్(35)కు తల్లిదండ్రులు లేకపోవడంతో కొన్ని రోజులపాటు ముంబాయిలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించాడు. ఇటీవలే మహబూబ్‌నగర్‌కు వచ్చి ఏనుగొండలో ఓ రూం అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు లేకపోవడంతోపాటు పెళ్లి కావడం లేదని తాగుడుకు బానిసయ్యాడు. దీంతో ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తి చెంది శనివారం జిల్లాకేంద్రంలోని ఏనుగొండ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

యువకుల ఘర్షణ: పోలీసులకు ఫిర్యాదు

ధరూరు: సందెపురాళ్లు ఎత్తే క్రమంలో గొడవ జరిగిన ఘటన మండలంలోని భీంపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన హనుమంతు జూన్ 23న సాయంత్రం గ్రామంలోని కూడలి వద్ద సందెపు రాళ్లు ఎత్తుతుండగా, అదే గ్రామానికి చెందిన వి.ఆంజనేయులు, ఎం. ఆంజనేయులు దాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. తనను దూషించి దాడి చేశారని శనివారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిందితులపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని మైలారం శివాలయం వద్ద శుక్రవారం గుప్తనిధుల కోసం యంత్రంతో అన్వేషిస్తూ పట్టుబడ్డ నిందితులపై గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు శనివారం కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ రేణయ్య తెలిపారు. మండలంలోని జీన్‌కుంట గ్రామానికి చెందిన పరశురాములు, ఐలయ్య, మైలారం గ్రామానికి చెందిన నర్సింహ్మారెడ్డి యంత్రంతో శివాలయం సమీపంలో అన్వేషిస్తుండగా గమనించిన గ్రామస్తులు, సర్పంచ్ వారిని పట్టుకొని తమకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో నకిలీల హవా

- ఆలయంలో అసలు ఉద్యోగుల కంటే వీరిదే ఎక్కువ హడావుడి
- అందుబాటులో ఉండని టూరిజం గైడ్
- ఇష్టానుసారంగా ప్రైవేట్ వ్యక్తుల నియామకం
- యాత్రికులకు తెలియని ఆలయ విశేషాలు


ఆలయంలో రాచమార్గాన టికెట్లు లేకుండా తమ వారిని లోపలికి తీసుకెళ్తున్న టూరిజం గైడ్

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అసలు ఉద్యోగులకు బదులు నకిలీలే హవా నడిపిస్తున్నారు. అందులోనూ ఆలయానికి వచ్చే వీఐపీలకు మాత్రమే వారి సేవలు అందుతున్నాయి. అలంపూర్ పర్యాటక కేంద్రం కావడంతో ఇటు భక్తులకు, అటు యాత్రికులకు ఆలయ విశేషాలు చెప్పేందుకు పదేళ్ల క్రితం గైడ్‌ను ఏర్పాటు చేశారు. అయితే రెగ్యులర్ ఉద్యోగులు అనారోగ్యం పేరుతో తమకు సంబంధించిన కొత్త వ్యక్తులను సేవలందించేందుకు ఆలయానికి పంపుతున్నారు. వీరు మాత్రం వీఐపీలకు ప్రత్యేక దర్శనం చేయిస్తూ తమ జేబులు నింపుకోవడానికి పనిచేస్తున్నారు. గైడ్ పేరిట టూరిజం ద్వారా జీతాలు పొందుతూ.. సేవలు మాత్రం వీఐపీలకు అందిస్తుండటం విశేషం.

యాత్రికులకు చేరని ఆలయ విశేషాలు..

అలంపూర్ క్షేత్రం గొప్పతనం యూట్యూబ్, ఇంటర్నెట్‌ల ద్వారా తెలుసుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, యాత్రికులకు టూరిజం గైడ్ అందుబాటులో ఉండటం లేదు. ఆశగా వచ్చిన యాత్రికులకు ఆలయ చరిత్ర తెలియక నిరాశతో వెనుదిరుగుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ఆలయంలో పనిచేసే సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆలయ ఉద్యోగుల విధి నిర్వహణ గాడి తప్పింది. ఆలయంలో ఏ ఉద్యోగి ఏం పని చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు ఆలయ ఉద్యోగులు ఏ రూపంలో ఆదాయం వస్తుందో.. ఆ పనులు మాత్రమే ఎంపిక చేసుకుని అక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

టూరిజం గైడ్‌ను పంపించాం..

ఆలయంలో టూరిజం గైడ్ విధి నిర్వహణ గురించి తెలుసుకొని దేవస్థానం కార్యాలయంలోకి రావొద్దని చెప్పాం. గైడ్ మాత్రమే బయట చెప్పుకోవాలి. ఆలయంలో ఇకపై భక్తులు, యాత్రికులు టికెట్లు తీసుకోకుండా లోపలికి తీసుకురావొద్దు. టికెట్ లేకుండా దర్శనం చేయిస్తే చర్యలు తీసుకుంటాం. – రంగనాథ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్

ఓబీసీలకు మోదీ చేసిందేమిలేదు


మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతురావు

- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీల ఓటమి ఖాయం
- పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతురావు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో ఓబీసీలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిందేమిలేదని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ అధ్యక్షతన శనివారం జిల్లా ఓబీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. కర్ణాటకలో బీసీలు, మైనార్టీలు ఓట్లు వేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కులాల వారీగా సర్వే చేసి ఇప్పటి వరకు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినప్పుడే ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దేశంలో కాంగ్రెస్ హవా కొనసాగుతుందన్నారు. రాహుల్‌గాంధీకి ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు ఓటమి చవిచూడటం ఖాయమన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశిస్తున్నారని జోష్యం చెప్పారు. లక్షలాది మందితో బీసీల గర్జన విజయవంతంగా నిర్వహించి.. మన వాటా కోసం హైకమాండ్ ముందు ఉంచుదామన్నారు. జాతీయ కాంగ్రెస్ ఓబీసీ నాయకుడు కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ 2004లో బీసీ గర్జన జరిగిందని, దాని ప్రభావంతో అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు కూడా అదేస్థాయిలో బీసీ గర్జన విజయవంతంగా నిర్వహించుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ఎర్ర శేఖర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు శంకర్‌ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, బెక్కరి అనిత, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించాలి..

వచ్చే ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించాలని పలువురు కాంగ్రెస్ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉండి పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నప్పటికీ సరైన గుర్తింపునకు నోచుకోవడం లేదన్నారు. కొత్తగా పార్టీలో చేరేవారికి టికెట్ల హామీలు ఇవ్వవద్దని కోరారు. దేవరకద్రకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్నా సరైన గుర్తింపు రాలేదన్నారు. 1999 నుంచి 2018 ఎన్నికల వరకు టికెట్ అడిగితే ఇవ్వలేదన్నారు. మూడు రోజుల క్రితం వచ్చిన వారికి జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారని, 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమలాంటి వారిని పట్టించుకోలేదన్నారు. ఎందుకు బీసీ నాయకుల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌కు చెందిన మహిళా నాయకురాలు మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరైనా రావొచ్చని, వచ్చిన రెండు నెలలకే టికెట్ కావాలంటే సాధ్యం కాదని, ఐదేళ్లు పార్టీ కోసం పనిచేసిన తర్వాతనే ఆలోచించాలని హితవు పలికారు.

చెడు మార్గం వైపు.. నేటి యువతరం



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్

- ప్రొఫెసర్ హరగోపాల్

అచ్చంపేట రూరల్: గత చరిత్ర సత్యాలను రేపటి తరానికి తెలియకుండా పాలకులు చేస్తున్న కుట్రల వల్ల నేటి యువతరం చరిత్రను మరిచి చెడు మార్గం వైపు అడుగులు వేస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఫంక్షన్ హాల్లో ఆ ప్రాంతానికి చెందిన రచయిత చెవ్వ రఘుపతి రాసిన 'కాలం మరువని యోధులు' అనే వ్యాస పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడుతున్న, నిలబడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతూ కేసులు పెట్టి అణచేసే ధోరణి అవలంభిస్తోందన్నారు. పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టి ప్రతి ఒక్కరూ ప్రజా ఉద్యమాల వైపు నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఆదివాసీలు వారి బతుకుదెరువు కోసం ఐదు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారన్నారు. నల్లమలలో చెంచు, ఆదివాసి గిరిజనులు సంస్కృతి సాంప్రదాయంతో జీవించే హక్కును పాలకులు కల్పించాలన్నారు. దేశంలో జరుగుతున్న విభిన్నకర వాస్తవ పరిస్థితులను తన వ్యాసాల ద్వారా వివరిస్తున్న దళిత జర్నలిస్టు సుజాతపై జరుగుతున్న దాడి ద్వారా వివక్ష, వ్యతిరేక పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి పరిస్థితుల్లో రచయిత రఘుపతి రాసిన 12 వ్యాసాలు ఆనాటి ఉద్యమ పరిస్థితులు, బడుగు, బలహీన వర్గాల ఔనత్యాన్ని చాటడం, నేటి తరానికి కావలసిన చరిత్ర సత్యాలను, వాటి లోతులను అధ్యయనం చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. అంతకు ముందు శాతవాహన విశ్వ విద్యాలయం సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు రాఘవాచారి, వెంకట్‌గౌడ్, సతీష్, నారాయణ, లక్ష్మీనారాయణ, పాండు, నాసరయ్య, గోపాల్, అనీల్ పాల్గొన్నారు.

జూరాలలో తగ్గుతున్న నీటిమట్టం



ధరూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోవడంతో రోజురోజుకూ జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. 20 రోజుల క్రితం వరకు 8 టీఎంసీల నీటితో కళకళలాడిన ప్రాజెక్టు.. తాగునీటి అవసరాలు, భీమా ఎత్తిపోతలు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో నీటిమట్టం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి కేవలం 147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చిందన్నారు. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నుంచి భీమా లిఫ్టు–1కు 596 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 81 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు కలిపి మొత్తం 992 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.640 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

500 గ్రాముల గంజాయి సీజ్: ఇద్దరు అరెస్ట్

మహబూబ్‌నగర్ క్రైం: హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకొచ్చి మహబూబ్‌నగర్‌లో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలో శనివారం ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా.. అందులో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన బీసు హర్షవర్ధన్ రెడ్డి, బోయ మహేష్‌నాయుడు వద్ద 500 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. వీరు ఇద్దరూ హైదరాబాద్‌లోని దూల్‌పేట ఏరియాలో గంజాయి కొనుగోలు చేసి, మహబూబ్‌నగర్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో సదరు ఇద్దరు వ్యక్తులను అర్బన్ తహసీల్దార్ పార్థసారధి ఎదుట హాజరు పరిచి, గంజాయి స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

తెలంగాణ వెనకబాటుకు వారే కారకులు

ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్


బైక్ ర్యాలీలో డీఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలంతా రెడ్లు, వెలమల పాలన కట్టుబాట్లను తెంచుకొని బయటకు రావాలని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం వెనుకబాటుకు గురైంది వారి నుంచేనని అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ధర్మసమాజ్ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆవిర్భావ సభ నిర్వహించారు. అంతకు ముందు విశారదన్‌కు పార్టీ నాయకులు జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. క్రిష్టియన్‌పల్లిలో ధర్మసమాజ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుండి ఆవిర్భావ సభకు చేరుకుని మాట్లాడారు. రెడ్లు, వెలమలు రాజ్యాధికారాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకొని బడుగు, బలహీన వర్గాల ప్రజలను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ బానిస సంకెళ్ల నుంచి బయటపడి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునప్పుడే ఆత్మగౌరవం పెంపొందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల నుంచి డీఎస్‌బీ అభ్యర్థులను బరిలో నిలుపుతుందని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబాటుకు ఆంధ్ర పరిపాలకులు కారకులు కారని, జిల్లాలోని రెడ్లు, వెలమలే అందుకు కారణమని ఆరోపించారు. రెడ్డి వర్గం నాయకులతో రాజకీయం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవాలనే తరుణంలో బీజేపీ అనూహ్యంగా కిషన్ రెడ్డికి పార్టీ రాష్ట్ర అధికార బాధ్యతలను ఇచ్చి తమ వైపునకు రెడ్డి వర్గాన్ని తిప్పుకోవాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరి ఇలా ఉండగా, బీఆర్ఎస్ వెలమలతో రాజకీయం చేస్తూ బడుగు, బలహీన వర్గాలను అణగదొక్కాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ తరుణంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. సభలో సంజీవ్ ముదిరాజ్, పద్మశాలి నాయకుడు సారంగి లక్ష్మికాంత్, డీఎస్‌బీ రాష్ట్ర నాయకులు రాఘవేందర్, క్రిష్ణనాయక్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శివన్, జిల్లా అధ్యక్షుడు రాములు, సంధ్యారాణి, ఎల్లయ్య, సూర్య, నరేష్, డేవిడ్, ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

కృష్ణానదిపై ఎత్తిపోతల పనులు ఆపాలి


కర్ణాటక నిర్మిస్తున్నా ఎత్తిపోతల పథకంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- కర్ణాటక ప్రభుత్వం ఇష్టానుసారంగా నీటిని తోడుతోంది
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కృష్ణా: కృష్ణానదిపై కర్ణాటక ప్రభుత్వం కడుతున్నా ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే నిలిపేయాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కర్ణాటకలోని గంజిపల్లి గ్రామంలో కృష్ణానదిపై కడుతున్న ఎత్తిపోతల పథకం పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. గురువారం సాక్షిలో 'కృష్ణానదిపై మరో అడ్డుకట్ట' అనే శీర్షికతో వార్త రావడంతో స్పందించిన ఆయన ప్రాజెక్టు పనులు వెంటనే ఆపాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా నది జలాలను తీసుకెళ్లడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే కర్ణాటక సర్కార్ ఎక్కడికక్కడ నదులపై ఆనకట్టలు కట్టి నీటిని తీసుకెళ్తోందన్నారు. రాయచూర్ జిల్లాలోని 18 గ్రామాలకు సాగునీటిని అందించేందుకు అక్కడి ప్రభుత్వం'189 కోట్ల తో ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. ఎత్తిపోతలకు నాలుగు 1750హెచ్‌పీ మోటర్లను బిగించి నీటిని తోడేందుకు సిద్ధం చేస్తున్నారన్నారు. ఇప్పటికే పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, బీజేపీ ఎక్కడికక్కడ కుతంత్రలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ విషయంపై తాను ఉన్నతాధికారులను కలిసి తగు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఆయన వెనుక పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, అశోక్‌గౌడ్ ఉన్నారు.

24గంటల్లో దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సైదులు


రికవరీ చేసిన బంగారం, స్మార్ట్ ఫోన్‌లు

- రూ.4లక్షల 58వేల విలువ చేసే బంగారం, స్మార్ట్ ఫోన్‌లు రికవరీ
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ సైదులు

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ఇంట్లో చోరీ చేసిన దొంగను 24గంటల్లో వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి బంగారం ఇతర వస్తువులు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వన్‌టౌన్ సీఐ సైదులు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురకు చెందిన తస్మిన్ ఉన్నిసా బేగం ఈనెల 6న రాత్రి భోజనం చేసిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. ఈనెల 7న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక వైపు ఉన్న గది తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం నల్లపూసల దండ, తులం బంగారం గాజు, ఒక తులం మ్యాట్నీలు, బంగారం ఉంగరాలు, చెవికమ్మలు, వెండి వస్తువులు, పది తులాల గొలుసులు, ఐదు స్మార్ట్ ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.4లక్షల 58వేలు వరకు ఉంటుందని బాధితురాలు తస్మిన్ ఉన్నిసాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి దొంగను 24గంటల్లో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. హనుమాన్‌పురకు చెందిన ఎండీ రషీద్ అలియాస్ నసీర్ అలియాస్ గుభా అనే ఆటో డ్రైవర్ దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని నుంచి రూ.4.58లక్షల విలువ చేసే బంగారం, వెండి వస్తువులు, ఐదు స్మార్ట్ ఫోన్లు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు తనిఖీ


చెక్‌పోస్టు వద్ద మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ అజయ్‌రావు

కేటీదొడ్డి: ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వచ్చే గోవా- కర్ణాటక లిక్కర్‌ను అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ అజయ్‌రావు అన్నారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా సరిహద్దులోని నందిన్నె చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కర్ణాటక- గోవా తదితర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా అవుతున్న నేపథ్యంలో నందిన్నె, బల్గెర చెక్‌పోస్టులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల్లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించాలన్నారు. అనుమానాస్పదంగా తిరిగే వాహనాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తి నిఘా ఉంచాలన్నారు. నకిలీ మద్యం విక్రయాలు అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్, జిల్లా ఎక్సైజ్ శాఖ సైదులు, ఎస్ఐ తదితరులు ఉన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న మక్తల్ సీఐ రాంలాల్

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం మహిళ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతి చెందిన జయమ్మ(52) కూతురు శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు పోలీసులు విచారణ చేపట్టి శనివారం నిందితులను పట్టుకున్నారు. ఈ మేరకు మక్తల్ సీఐ రాంలాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 6గంటల ప్రాంతంలో పొలం చూడటం కోసం వచ్చిన జయమ్మను పొలం వద్ద ఉన్న పలుగుతో సొంత మరిది వెంకటప్ప దాడి చేసి హత మార్చినట్లు ప్రాథమిక నిర్ధారణలో తేలిందని సీఐ తెలిపారు. హత్య అనంతరం మృతదేహాన్ని మాయం చేసేందుకు వెంకటప్ప అన్న కుమారుడు సురేష్‌కు ఫోన్ ద్వారా సమాచారమిచ్చి ఘటన స్థలానికి పిలిపించుకున్నట్లు తెలిపారు. హత్యకు ప్రధానంగా భూ తగాదాలే కారణమని చెప్పారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ రాంలాల్, ఎస్ఐ మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.